జిల్లా కేంద్రంలో ముక్కు మూసుకోవాల్సిందే!

- భీమవరం పట్టణంలో అధ్వానంగా పారిశుద్ధ్యం
- ప్రధాన సెంటర్‌లలో మాత్రమే చెత్త తొలగింపు
- శివారు ప్రాంతాల్లో ఎక్కడి చెత్త అక్కడే
- జేసీ ఆదేశాలను పట్టించుకోని పారిశుద్ధ్య అధికారులు


ప్రకాష్ నగర్‌లో రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తాచెదారం


డంపింగ్ యార్డ్‌ను తలపిస్తున్న ఆరో వార్డు చివరి ప్రాంతం

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణంలో ఎక్కడి చెత్త అక్కడే ఉండడంతో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. పట్టణంలోని ప్రధాన సెంటర్‌లలో మాత్రమే చెత్తను తొలగించి చివరి ప్రాంతాల్లో అధికారులు తిరగని ప్రాంతాల్లోని చెత్తాచెదారాన్ని తొలగించడం లేదు. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు అధ్వానంగా ఉన్న చెత్తాచెదారం వలన రోగాల పాలవుతున్నారు. దోమలు విజంభిస్తున్నాయని రోజుల తరబడి చెత్తాచెదారాన్ని అలాగే వదిలేయడం వలన దుర్వాసన వస్తున్నాయని వాపోతున్నారు.

పట్టించుకోని పారిశుద్ధ్య అధికారులు

పట్టణంలో పలు వార్డుల్లో చెత్తాచెదారం రోజుల తరబడి నిల్వ ఉండడం, మధ్యాహ్నం రెండు గంటల వరకు కూడా చెత్తను తొలగించకపోవడం వంటివి జరుగుతున్నప్పటికీ పారిశుద్ధ్య అధికారులు పట్టించుకోవడం లేదు. కేవలం ప్రధాన సెంటర్‌లలో ఉండే చెత్తను తొలగించి పట్టణం మొత్తం శుభ్రం చేసినట్లుగా పారిశుద్ధ్య అధికారులు వ్యవహరిస్తున్నారు. పట్టణంలో మొత్తం 39 వార్డులు ఉండగా వాటిలోని శివారు ప్రాంతాల్లో జన సంచారం లేని చోట చెత్తాచెదారాన్ని డంప్ చేసి వదిలి వేస్తున్నారు. డీఎన్‌ఆర్ కళాశాల సమీపంలో డంపింగ్ యార్డ్ ఉన్నప్పటికీ అక్కడికి వార్డులోని చెత్తాచెదారాన్ని తీసుకెళ్లడం లేదు. ఈ విషయం మున్సిపల్ పారిశుద్ధ్య అధికారులకు తెలిసినా కూడా పట్టించుకోవడం లేదు.

జేసీ ఆదేశాలను పట్టించుకోని అధికారులు

భీమవరం మున్సిపాలిటీ ప్రత్యేక అధికారిగా ఉన్న జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి ఆదేశాలను భీమవరం మున్సిపాలిటీ అధికారులు ముఖ్యంగా పారిశుద్ధ్య అధికారులు పట్టించుకోవడం లేదు. అందుకు నిదర్శనమే భీమవరంలో ఎక్కడి చెత్త అక్కడ ఉండడంతో జేసీ అనేక సార్లు పట్టణంలో పర్యటించి మున్సిపల్ అధికారులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి భీమవరంలో పారిశుద్ధ్యం మెరుగ్గా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటి వరకు మున్సిపల్ పారిశుద్ధ్య అధికారులు ప్రత్యేక అధికారి ఆదేశాలను ప్రకారం పట్టణాన్ని పరిశుభ్రం చేయలేకపోయారు.

చెత్తతో నిండిపోతున్న డ్రెయిన్లు

పట్టణంలో డ్రెయిన్లు చెత్తతో నిండిపోతున్నాయి. దీంతో మురుగు నీరు ముందుకు ప్రవహించే వీలు లేక ఎక్కడి నీరు అక్కడే ఆగిపోతుంది. దీంతో స్థానికులు దుర్వాసన, దోమలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డ్రెయిన్ల పక్కన పారవేసిన చెత్తను తొలగించకపోవడంతో క్రమేపీ చెత్త డ్రెయిన్లలోకి గెంటేస్తున్నారు. వర్షాకాలంలో డ్రెయిన్ల ముంపు నీటిని వేగంగా లాగడంలో తీవ్ర ఆటంకం ఏర్పడుతుంది. దీంతో వీధి రోడ్లు ముంపునకు గురై పట్టణ ప్రజలు మురికి నీటిలో రాకపోకలు సాగించి, రోగాల పాలవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగు పరిచే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వాహనాలు, సిబ్బంది ఉన్నప్పటికీ ఎక్కడి చెత్త అక్కడే

గ్రేడ్ వన్ మున్సిపాలిటీగా ఉన్న భీమవరం పట్టణంలో చెత్త సేకరణకు సంబంధించి మున్సిపాలిటీ నుంచి సరిపడా వాహనాలు, పారిశుద్ధ్య సిబ్బంది పూర్తి స్థాయిలో ఉన్నప్పటికీ ఎక్కడిద చెత్త అక్కడే ఉంటుంది. భీమవరం మున్సిపాలిటీలో చెత్త సేకరణకు సంబంధించి మున్సిపాలిటీ వాహనాలు 16, అలాగే క్లాప్ వాహనాలు 15 ఉన్నాయి. పూర్తి స్థాయిలో పారిశుద్ధ్య సిబ్బంది ఉన్నారు అయినప్పటికీ నూటికి నూరు శాతం చెత్త సేకరణ చేయలేకపోతున్నారు.


కలెక్టరేట్‌కు వెళ్లే దారిలో మురికి కాలువలో వేసిన చెత్తాచెదారం

కాలువ శివారు ప్రాంతాలను ప్రక్షాళన చేయాలి


కాలువపూడిక తీత పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ సాంబశివరావు

ఉండి: కాలువ పూడికతీత పనుల్లో భాగంగా చెరుకువాడ, కలసిపూడి గ్రామాలు ఉండి కాలువ శివారు కనుక పూర్తి స్థాయిలో పనులు నిర్వహించి రైతాంగానికి ఆటంకం లేని సాగునీటిని అందించాలని చెరుకువాడ గ్రామ సర్పంచ్ కొండవేటి సాంబశివరావు అన్నారు. శుక్రవారం గ్రామ పరిధిలో నిర్వహిస్తున్న ఉండి పంట కాలువ పూడికతీత పనులను ఆయన పరిశీలించి పలు సూచనలు, సలహాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉండి కాలువ పరిధిలో మిగిలిన గ్రామాలు ఓ ఎత్తయితే కాలువ శివారు గ్రామాలైన చెరుకువాడ, కలిసిపూడి, అర్తమూరు మరో ఎత్తని అన్నారు. అనేక ఏళ్ల నుంచి గ్రామానికి చెందిన రైతులు ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేస్తున్నారని శివారు గ్రామాల్లో వ్యవసాయం, తాగునీటికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

28న రాజ్యసభ సభ్యుడిగా 'పాకా' ప్రమాణం

భీమవరం: బీజేపీ నేత పాకా వెంకట సత్యనారాయణ ఈ నెల 28న రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ విషయాన్ని ఆయన శుక్రవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. పదవి చేపట్టిన అనంతరం కేంద్ర సహాయ మంత్రి బి.శ్రీనివాసవర్మతో కలసి జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. సమావేశంలో పార్టీ నేతలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అంజన్న ఆలయంలో అన్నసమారాధన


అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

ఆకివీడు: హనుమద్ జయంతి పురస్కరించుకొని భారీ అన్నసమారాధనను స్థానిక పెద్దింట్లమ్మ ఆలయం వద్ద వేంచేసియున్న శ్రీఅభయాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేసి, నైవేద్యాలు సమర్పించి, పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జగ్గురోత్తి విజయకుమార్, కుంకట్ల దానయ్య, బొల్లా వెంకట్రావు, కలిదిండి ఇంద్రరాజు, డాక్టర్ మహేష్ వర్మ, కిమిడి నాగరాజు, మజ్జి బాలకృష్ణ, పిల్లా నాగరాజు, ఈపీ సత్తిబాబు, జమ్మాని పెద్దిరాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో డ్రైవర్‌కు గాయాలు


చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు

ఆకివీడు: మండలంలోని గుమ్ములూరు రోడ్‌లో జేసీబీ డ్రైవర్ రాజుకు హై టెన్షన్ విద్యుత్ వైర్లు తగిలి శుక్రవారం తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చి వైద్యం అందజేశారు. రాజు కోరుకుంటున్నాడని వైద్యురాలు ఎండీ నజ్రీం చెప్పారు. బాధితుడిని వైఎస్సార్‌సీపీ నాయకులు తిక్కల రామాంజనేయులు, మరి కొంతమంది యువకులు సకాలంలో ఆసుపత్రికి తరలించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాళ్ల: పెదఅమిరం విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో లైన్ల మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు కోపల్లె, వేంపాడు గ్రామాలకు, చెరువులకు, ఇండస్ట్రీలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.వెంకటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉండిలో..

ఉండి: మండలంలోని కోలమూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌కు సంబంధించిన కొత్త విద్యుత్ లైన్ల ఏర్పాటు నిమిత్తం 24వ తేదీ శనివారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు గ్రామంలోని అన్ని గృహ సముదాయాలకు, ఆక్వా చెరువులు, పరిశ్రమలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు పత్రికా ప్రకటనలో శుక్రవారం తెలిపారు.

దాడి కేసు నమోదు

ఉండి: పాతకక్షల నేపథ్యంలో ఓ వ్యక్తిపై దాడి చేసిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మహదేవపట్నం గ్రామానికి చెందిన కోనాల సంతోష్‌కుమార్‌ను పాత కక్షల నేపథ్యంలో దాయం శ్రీను, దాయం రవి కుమార్, దాయం ఆదర్శ్, ఆదిలక్ష్మి, మరికొందరు కలిసి ఈ నెల 22వ తేదీ రాత్రి 10 గంటలకు ఉండి సెంటర్‌లో అడ్డగించి ఇనుపరాడ్డుతో దాడి చేశారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎండీ నసీరుల్లా తెలిపారు.

మరో కేసు..

కారణం లేకుండా వ్యక్తిపై దాడి చేసిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. పెదపేటకు చెందిన కాట్రగడ్డ నవీన్ కుమార్ (చింటూ) ఈ నెల 10వ తేదీ రాత్రి 9 గంటలకు పాలకోడేరు గ్రామానికి మహదేవపట్నం మీదుగా వెళుతుండగా గ్రామ శివారులో అదే గ్రామానికి చెందిన కోనాల విజయ్ కుమార్ అతడి ఇద్దరు కుమారులతో కలిసి కారణం లేకుండా తనపై దాడి చేసి కొట్టారని బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యం దుకాణదారులు నిబంధనలు పాటించాలి


మద్యం దుకాణం వద్ద ఎక్సైజ్ ఎస్సైలు

తణుకు అర్బన్: తణుకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మద్యం దుకాణాల సమయపాలన, ఎమ్మార్పీ ధరలకు అమ్మకంతో పాటు అన్ని నిబంధనలు ఖచ్చితంగా అమలు జరిగేలా నిరంతరం నిఘా ఏర్పాటు చేసినట్లు ఆ శాఖ సీఐ సత్తి మణికంఠరెడ్డి తెలిపారు. ప్రతి రోజూ రాత్రి నిర్దేశించిన సమయానికి మద్యం దుకాణాలు మూసివేసేలా, నిర్ణీత సమయానికి ముందుగా మద్యం దుకాణాలు తెరవకుండా నిరంతర పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతి మద్యం దుకాణానికి ఒక కానిస్టేబుల్, ఒక హెడ్ కానిస్టేబుల్‌ను బాధ్యులను చేశామని, వినియోగదారులకు అందించే మద్యం నాణ్యతను కూడా నిరంతరం పరిశీలిస్తామన్నారు. ఇందులో భాగంగా నెలకోసారి ప్రతి దుకాణం నుంచి మద్యం బాటిళ్ల శాంపిళ్లను తీసి ల్యాబ్‌కు పంపించి, నాణ్యత పరీక్షలు నిర్వహిస్తామన్నారు. మద్యం దుకాణదారులు నిబంధనలు ఖచ్చితంగా పాటించే విధంగా చర్యలు చేపట్టినట్లు వివరించారు.

రోడ్డు నిర్మాణానికి రైల్వే అధికారుల ప్రతిపాదన


అధ్వానంగా ఉన్న మంచిలి-అరవల్లి మధ్య రైల్వే లెవల్ క్రాసింగ్ వద్ద లింక్ రోడ్డు

భీమవరం: అత్తిలి మండలం మంచిలి-అరవల్లి గ్రామాల మధ్య రైల్వే లెవల్ క్రాసింగ్ వద్ద ఉన్న లింక్ తారురోడ్డు నిర్మాణానికి రైల్వే అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారని కేంద్ర ఉక్కు, భారీపరిశ్రమలశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ కార్యాలయం శుక్రవారం తెలిపింది. రైతులు, ప్రజలకు ఎంతో ఉపయోగకరమైన రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో ఆ ప్రాంత ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. త సమస్యను పరిష్కరించాలని మంచిలి ప్రజలు మంత్రి శ్రీనివాసవర్మను కోరగా రోడ్డు నిర్మాణం చేపట్టాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌కు అరుణ్ కుమార్ జైన్‌కు లేఖ రాశారు. దీనికి స్పందించిన అరుణ్ కుమార్‌జైన్ పరిశీలించి ప్రణాళికలు తయారు చేసినట్టు కేంద్ర సహాయ మంత్రి కార్యాలయ అధికారులు తెలిపారు.

రైతులకు పశువుల దాణా పంపిణీ


ఐభీమవరంలలో పశువుల దాణాను పంపిణీ చేస్తున్న అధికారులు

ఆకివీడు: మండలంలోని పశువులకు ఉచిత దాణా పంపిణీ కార్యక్రమం శుక్రవారం చేపట్టారు. మండలానికి 12 టన్నుల దాణా మంజూరైందని మండల వెటర్నరీ అధికారి అధికారి భార్గవి సత్య తెలిపారు. ఐభీమవరం గుమ్మలూరు గ్రామాలకు పది టన్నులు పెద్దాపురం గ్రామానికి రెండు టన్నుల దాణా మంజూరైందని ఆమె వివరించారు. ఈ దాణాలు పశువుల్లో అధిక పాల ఉత్పత్తికి తోడ్పడతాయని ఆమె సూచించారు.

సబ్సిడీపై పశువుల దాణా

భీమవరం అర్బన్: మండలంలోని తాడేరు గ్రామంలో రైతుసేవా కేంద్రంలో శుక్రవారం సబ్సిడీపై పశువుల దాణా సరఫరాను రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయితీపై పశు దాణా అందించి రైతుల్లో ధీమా కలిగిస్తున్నామన్నారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన పాడి రైతులకు 50 శాతం రాయితీపై అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ మురళీ కృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు, డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ పి.సుధీర్ బాబు, మండల పశు వైద్యాధికారి పి.పుండరీబాబు, డాక్టర్ మౌర్య సత్యేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆఫ్ కైండ్‌నెస్ సేవలు అభినందనీయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్ క్లబ్ ఆఫ్ కైండ్‌నెస్ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కొనియాడారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ కైండ్‌నెస్, ఆశ్రమ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో పాలూరి నాగ బలుసులరావు సౌజన్యంతో శుక్రవారం ఉదయం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. జనరల్ మెడిసిన్, కంటి వైద్య పరీక్షలు, ఆర్థోపెడిక్, స్త్రీ, ప్రసూతి, చెవి, ముక్కు, గొంతు, చర్మవ్యాధులు, రేడియాలజీ తదితర విభాగాలలో వైద్య పరీక్షలు జరిగాయి. 230మంది శిబిరంలో పాల్గొన్నారు. ఉచితంగా ఎక్స్‌రేలు, స్కానింగ్, ఈసీజీలు, రక్తపరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

యోగాతో మానసిక ఒత్తిడి దూరం


పాలకోడేరు: యోగా సాధన చేస్తున్న మండల అధికారులు

భీమవరం (ప్రకాశంచౌక్): యోగాతో మానసిక ఒత్తిడిని దూరం చేసుకొని ప్రశాంతమైన జీవనం కొనసాగించొచ్చని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం ఏఎస్‌ఆర్ నగర్ అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కళా కేంద్రంలో జిల్లా రెవెన్యూ అధికారి యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ మే 21వ తేదీ నుంచి జూన్ 21వ తేదీ వరకు జరిగే యోగాంధ్ర-2025 కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. వార్డు, గ్రామ స్థాయిలో ప్రజలకు యోగాపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ, జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ కె.మురళీకృష్ణ, లీడ్ బ్యాంకు మేనేజరు ఎ.నాగేంద్ర ప్రసాద్, పలు శాఖల అధికారులు, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

పాలకోడేరు: అంతర్జాతీయ యోగా వేడుకల్లో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విశాఖపట్నానికి విచ్చేయుచున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర సర్వే రిజిస్ట్రేషన్ యాప్ ఆయా గ్రామ సచివాలయ సిబ్బంది లాగిన్లలో పొందుపరిచారని దీని ఆధారంగా సర్వే చేయాలని ఎంపీడీవో వి.రెడ్డియ్య అన్నారు. శుక్రవారం మహిళా సమాఖ్య కార్యాలయంలో ఎంపీడీవో వి.రెడ్డియ్య ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులకు యోగాపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని, దీని ప్రాముఖ్యత గురించి ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రభుత్వం జాయింట్ కలెక్టర్ల ద్వారా మండల స్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారన్నారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.


భీమవరం (ప్రకాశం చౌక్) : అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కళా కేంద్రంలో యోగా సాధన చేస్తున్న అధికారులు


ఉండి: యోగా తరగతుల్లో పాల్గొన్న ఇన్‌చార్జి ఎంపీడీవో సీవీఎస్ రెడ్డి

ఆరోగ్యానికి యోగాతో మహాభాగ్యం

ఉండి: యోగా చేయడం వలన ఆరోగ్యానికి మహా భాగ్యం కలుగుతుందని మండల ఇన్‌చార్జి ఎంపీడీవో సీవీఎస్ రెడ్డి, తహసీల్దార్ కె.నాగార్జున అన్నారు. శుక్రవారం ఉండిలో నిర్వహించిన యోగా తరగతుల్లో వారు పాల్గొని సచివాలయ ఉద్యోగులు, గ్రామ కార్యదర్శులు, రెవెన్యూ ఉద్యోగులు యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పురాతన కాలం నుంచి ఎంతో మంది యోగాసనాలతో ఆరోగ్యపరంగా గొప్ప ప్రయోజనాలు పొందారన్నారు. తీవ్ర ఒత్తితో ఉద్యోగాలు చేసే వారందరికి యోగా ఔషధం వలే పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో పలు శాఖల ఉద్యోగులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

క్రీస్తు మార్గంలో పయనించాలి

తాడేపల్లిగూడెం రూరల్: విశ్వాసులు క్రీస్తు మార్గంలో పయనించాలని యూపీఏ తాడేపల్లిగూడెం చైర్మన్ జ్యోతి ఆనంద్ అన్నారు. శుక్రవారం మండలంలోని వెంకట్రావుపాలెం అపోస్తలు చర్చిని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొరుగు వారిని ప్రేమతో ఆదరించాలనే క్రీస్తు సూక్తులను విశ్వాసులు అనుసరించాలన్నారు. జ్యోతి ఆనంద్, సుస్మిత, చర్చి నిర్వాహకులు సామ్యూల్ పాల్, హెప్సిబాలను విశ్వాసులు సత్కరించారు.

ఘనంగా పైళ్లమ్మ జాతర


ప్రత్యేక అలంకరణలో పైళ్లమ్మ అమ్మవారు

పెంటపాడు: మండలంలోని ప్రత్తిపాడు గ్రామంలో పైళ్లమ్మ జాతర ఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ నెల 8 నుంచి ప్రారంభమైన ఈ ఉత్సవాలలో భాగంగా మూడో సేవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నడివీధికి తీసుకొచ్చిన అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. తొలుత గ్రామస్తుల దర్శనాల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఘటాలకు ప్రత్యేక పూజలు చేసి 4 గ్రూపులుగా గ్రామోత్సవాలు ఏర్పాటు చేశారు. తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు అమ్మవారి పూడిగుడి వద్ద మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. 23న జాతర ఉత్సవం సందర్భంగా కేరళ డ్రమ్స్, బెల్లీ నృత్యాలు, తీన్‌మార్ స్టార్‌బాయ్స్, కాళికా డాన్స్, హైదరాబాద్ పోతురాజు టీం నృత్యాలు, సాల్మన్, సినీ కోబ్రా, గారడీ నృత్యాలు, అలాగే భారీబాణ సంచా కాల్పులు నిర్వహించారు. సుమారు 10 రకాల ఉత్సవ ప్రచార సామగ్రితో అమ్మవారిని ఊరేగించారు. రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు గ్రామోత్సవం పురస్కరించుకొని గ్రామంలో సందడి నెలకొంది. ఆడపడుచులు అమ్మవారికి సారె, చీరలు సమర్పించి మొక్కులు తీర్చుకొన్నారు. 24న అమ్మవారి బలిచేట 25న నైవేద్యాల సమర్పణ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

వర్షాలు పడుతుంటే పూడికతీత పనులా?

- అస్తవ్యస్తంగా వేల్పూరు రోడ్డు
- దుర్వాసనతో రోగాల బారిన పడుతున్న ప్రజానీకం.. పట్టించుకోని అధికారులు
- వ్యాపారాలు పోయాయంటున్న దుకాణదారులు


వేల్పూరు రోడ్డులో మురుగును దాటేందుకు స్థానికుడు చేస్తున్న ఫీట్లు

తణుకు అర్బన్: తణుకు వేల్పూరు రోడ్డులోని డ్రెయినేజీల్లో మునిసిపల్ అధికారులు చేపట్టిన పూడికతీత పనులపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వేసవి కాలమే అయినప్పటికీ వర్షాలు పడుతున్న రోజుల్లో ప్రధాన డ్రెయినేజీల్లో పూడికతీత పనులు చేయడమేంటని నిలదీస్తున్నారు. గత వారం రోజులుగా ప్రతి రోజూ ఏదోక సమయంలో వర్షం వస్తున్న విషయం అందరికీ తెలిసిందే. తణుకు కప్పల వెంకన్న సెంటర్, వేల్పూరు రోడ్డులో వర్షం వస్తున్నా పూడికతీత పనులు నిర్వహిస్తున్నారంటూ దుకాణదారులు, నివాసితులు, ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. పూడికతీత పనులు చేయడం మంచిదేకానీ వర్షాలు పడుతున్న సమయంలో డ్రెయినేజీలోని మురుగును రోడ్డుపైనే వేయడంతో వర్షపునీటికి రోడ్డంతా కమ్మేయడం, తీసిన మురుగు తిరిగి డ్రెయినేజీల్లోకి వెళ్తుండడం వలన పని దండగ అని వాపోతున్నారు. అంతేకాకుండా ఈ రహదారులు గత మూడు రోజులుగా మురికి కూపాలుగా మారిపోయాయని ఇళ్లలోకి, దుకాణాల్లో వెళ్లలేకపోతున్నాయంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఈ ప్రధాన రహదారులకు అనుసంధానంగా ఉన్న రోడ్లలోకి వెళ్లలేని స్థితిలో మురుగు పేరుకుపోయిందని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా వర్షాలు పడే సమయంలో పూడికతీత పనులు నిలిపివేయాలని ప్రజానీకం కోరుతున్నారు. మురుగు రోడ్లపై పోగుగా పెట్టడంతో వర్షం కారణంగా అంతా కలిసిపోయి దుకాణాల్లోకి వచ్చే మార్గం కూడా లేకపోయిందంటూ వ్యాపారులు వాపోతున్నారు.


వేల్పూరు రోడ్డు నుంచి తాడి వారి వీధిలోకి వెళ్లే మార్గం దుస్థితి


తణుకు కప్పలవెంకన్న సెంటర్ నుంచి రూట్స్ స్కూలుకు వెళ్లే రోడ్డు ఇలా..


తణుకు తిప్పాని వారి వీధికి వెళ్లే మార్గంలో రోడ్డుకు అడ్డంగా తిప్ప వేసిన మురుగు

ప్రతి రోజూ డ్రైడేగా పాటించాలి


ర్యాలీ నిర్వహిస్తున్న సబ్ యూనిట్ ఆఫీసర్

తణుకు అర్బన్: వర్షాలు పడుతున్న నేపథ్యంలో ఇకపై ప్రజలంతా ఇకపై ప్రతిరోజూ డ్రైడేగా పాటించాలని సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలోని జంగం చెర్వు అంగన్‌వాడీ సెంటర్, గణేష్ చౌక్ సమీపంలోని మసీదు ఏరియాలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ఎన్జీవో కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె.పృథ్వీరాజ్ నిర్వహించిన కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. పరిసరాలను డ్రై చేయడం ద్వారా ప్రమాదకరమైన మలేరియా, చికున్ గున్యా వంటి వ్యాధులను వ్యాప్తి చేసే దోమల పుట్టుకకు చెక్ పెట్టవచ్చాన్నారు. ఇండ్లలో నీరు చేరడానికి అవకాశం ఉన్న పనికిరాని సామగ్రిని సత్వరమే తొలగించుకోవాలని సూచించారు. డ్రెయిన్‌లలో చెత్త వేయవద్దని, దోమ పుట్టరాదు అన్న నినాదానికి అనుగుణంగా ఇప్పుడు చెప్పిన ఖర్చు రహిత పద్ధతులను పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫైలేరియా కంట్రోల్ యూనిట్ సూపర్‌వైజర్ కె. సత్యన్నారాయణ, వార్డు హెల్త్ సెక్రెటరీలు కె.బేబీ కుమారి, బి.శిరీష, వార్డు ఉమన్ ప్రొటెక్షన్ సెక్రెటరీ ఎండి.హర్ష బేగం, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎం.అరుణ కుమారి, అంగన్‌వాడీ టీచర్ వి.వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ హెల్పర్ ఎండీ ఖౌలా, ఆశా కార్యకర్త ఇ.లలిత పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత సామాజిక బాధ్యత

తాడేపల్లిగూడెం (టీఓసీ): పరిసరాల పరిశుభ్రత సామాజిక బాధ్యత అని, సమష్టి కృషితో కీటక జనిత ప్రదేశాలను నిలువరించి దోమల వ్యాప్తిని అరికడదామని సబ్ యూనిట్ అధికారి వై.వీ.లక్ష్మణరావు అన్నారు. పట్టణంలోని శుక్రవారం డ్రై డే కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ దోమలు వృద్ధి చెందే ప్రదేశాలను గుర్తించి వాటిని నిర్వీర్యం చేయాలన్నారు. ఆరోగ్య కార్యదర్శి రాజేశ్వరీ, దుర్గాదేవి, చిన్నపాప, ఆశా వర్కర్లు లక్ష్మీ, దుర్గ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.